క్లుప్తంగా

నడవపల్లమ్మపై ఆడియో సీడీ ఆవిష్కరణ



నడవపల్లిలో ఆడియో సీడీని ఆవిష్కరించిన డీఎస్పీ అంబికా ప్రసాద్

కాట్రేనికోన: మండలంలోని నడవపల్లిలో తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ కేటీ పద్మజ రచించిన 'చల్లని తల్లి సౌభాగ్యవల్లి నడవపల్లమ్మ నమోస్తుతే' అనే ఆడియో సీడీని డీఎస్పీ అంబికా ప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నడవపల్లమ్మ తల్లి మహిమలను గీతరచన ద్వారా అందించిన పద్మజను అభినందించారు. కార్యక్రమంలో కాట్రేనికోన ఎస్‌ఐ బి.నాగేశ్వరరావు, చిరంజీవిరాజు, కేటీ చిన్నబ్బాయి, రామకృష్ణ, గ్రంధి నానాజీ తదితరులు పాల్గొన్నారు.

కార్తిక వన సమారాధన



వెంకటపతిరాజును సత్కరిస్తున్న ఎమ్మెల్సీలు సూర్యనారాయణరాజు, రఘువర్మ తదితరులు

అమలాపురం రూరల్: పట్టణంలోని క్షత్రియ కమ్యూనిటీ హాలులో కోనసీమ క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీలు పి.సూర్యనారాయణరాజు, పాకలపాటి రఘువర్మలు హాజరయ్యారు. ఏటికొప్పాక గ్రామానికి చెందిన పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతలపాటి వెంకటపతిరాజును సత్కరించారు. కార్యక్రమంలో కోనసీమ క్షత్రియ సేవ సమితి అధ్యక్షుడు డీఎస్ఎన్ రాజు, చైతన్య సంస్థల అధినేత కేవీవీ సత్యనారాయణరాజు, మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నాని రాజు పాల్గొన్నారు.

ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలంటూ వినతి



ఐఏఎస్ అధికారి కేశవన్‌ను కలిసిన ఎఫ్‌టీసీఎల్ సిబ్బంది

యానాం: వివిధ ప్రభుత్వ శాఖల్లో 19 ఏళ్లుగా ఫుల్‌టైమ్ క్యాజువల్ లేబర్(ఎఫ్‌టీసీఎల్) డైలీ రేటెడ్ పద్ధతిలో పనిచేస్తున్న తమను పర్మినెంట్ చేయాలని కోరుతూ పలువురు సిబ్బంది ఆదివారం పుదుచ్చేరి ఐఏఎస్ అధికారి కేశవన్‌కు వినతిపత్రం అందజేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన కేశవన్ త్వరలోనే ఖాళీలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎఫ్‌టీసీఎల్ ఎంప్లాయీస్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

యానాం: నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న స్పెషల్ సమ్మరీ రివిజన్ ఆఫ్ ది ఎలక్ట్రోరల్ రోల్ ప్రక్రియను ఆదివారం పుదుచ్చేరి ఎన్నికల రోల్ అబ్జర్వర్, ఐఏఎస్ అధికారి కేశవన్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సావిత్రినగర్, గిరియాంపేట, దరియాలతిప్ప, దొమ్మేటిపేట, పరంపేట, అయ్యన్ననగర్, కురసాంపేట తదితర ప్రాంతాల్లో జరుగుతున్న ఓటర్ల నమోదు ప్రక్రియ గురించి సంబంధిత బూత్‌లెవల్ ఆఫీసర్లను అడిగి తెలుసుకున్నారు. అర్హులందరినీ ఓటర్ల జాబితాలో చేర్చాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఏఓ మునిస్వామి, ఎలక్షన్ డిపార్ట్‌మెంట్ అధికారి తిరుకోటి అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ఐదు లీటర్ల సారా స్వాధీనం

యానాం: నియోజవకర్గ పరిధిలోని పరంపేటలో దంగేటి ధనలక్ష్మి గృహంలో దాచి ఉంచిన ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ శేరు నూకరాజు ఆదివారం తెలిపారు.

విజేతలకు బహుమతులు



అంతర్వేదిలో ప్రశంసా పత్రాలు అందుకున్న కళాకారులతో సత్యనారాయణ

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహస్వామి వారి ఆలయ ప్రాంగణంలో ఆదివారం హైదరాబాదుకు చెందిన ప్రజాపతి ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వహించిన కల్చరల్ ప్రోగ్రాంలోని విజేతలకు మెడల్స్, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, ఎంపీపీ వీరా మల్లిబాబు వీటిని కళాకారులకు అందజేశారు. ట్రస్ట్ అధినేత ఫణీంద్రకుమార్ ఆధ్వర్యంలో కూచిపూడి, భరతనాట్యం, ఒడిస్సీ తదితర సాంస్కృతిక పోటీలను నిర్వహించారు. అనంతరం ముఖ్య అతిథిలైన ఏసీ సత్యనారాయణ, ఎంపీపీ మల్లిబాబులను ఆయన శాలువాతో సత్కరించారు. ప్రముఖుడు కుసుమ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలు విస్తృతం

- అర్బన్ హెల్త్ సెంటర్లలో మెరుగైన సౌకర్యాలు
- రెండో యూహెచ్‌సీ రాకతో పెరిగిన అవకాశాలు

అమలాపురం టౌన్: జిల్లా కేంద్రం అమలాపురం పట్టణంలో ప్రభుత్వ ఉచిత వైద్య సేవలను మరింత విస్తృతం చేస్తున్నారు. అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ద్వారా, స్థానిక చల్లావారి వీధిలోని అర్బన్ హెల్త్ సెంటర్(యూహెచ్‌సీ), మాతా శిశు వైద్యాలయాల ద్వారా ప్రజలకు వైద్య సదుపాయాలు సమకూరుస్తున్నారు. పెరుగుతున్న జనాభాకు తగ్గట్టుగా పట్టణంలో రెండో అర్బన్ హెల్త్ సెంటర్ అవసరాన్ని ప్రభుత్వం గుర్తించి 2021లోనే పట్టణంలోని కచేరి చావిడి భవనంలో రెండో అర్బన్ హెల్త్ సెంటరును ఏర్పాటుచేసింది. స్థానిక ఈడబ్ల్యూఎస్ కాలనీలో రూ.85 లక్షలతో పూర్తి అధునాతన సౌకర్యాలతో సొంత భవనాన్ని నిర్మిస్తోంది. 90 శాతం పనులు పూర్తయిన ఈ సొంత భవనంలోకి త్వరలోనే అర్బన్ హెల్త్ సెంటరు తరలనుంది. మొత్తంగా జిల్లా కేంద్రంలో ఏరియా ఆస్పత్రి, రెండు అర్బన్ హెల్త్ సెంటర్లు, ఒక మాతా శిశు వైద్యాలయాల ద్వారా ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారు.

అందుబాటులో 50 రకాల టెస్టులు



అర్బన్ హెల్త్ సెంటరులో రోగికి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

పట్టణంలోని రెండు వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ల ద్వారా దాదాపు 50 రకాల వైద్య పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. ఓ పక్క 100 పడకలతో ఉన్న ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ద్వారా పలు వైద్య విభాగాలతో అన్ని టెస్టులను ఉచితంగా చేసి ప్రత్యేక వైద్యం అందిస్తుంటే అర్బన సెంటర్లలోనూ పలు రుగ్మతలకు ప్రాథమిక వైద్యం అందించి ఉచితంగా మందులు సరఫరా చేస్తున్నారు. బ్లడ్, యూరిన్, బీపీ, షుగర్‌తో పాటు పలు రోగాలకు ముందస్తు టెస్టులు చేసేందుకు అధునాతన ల్యాబ్‌లను ఏర్పాటుచేశారు. అర్బన్ సెంటర్లలో ఒక వైద్యుడు, ఇద్దరు



అమలాపురం అర్బన్ హెల్త్ సెంటరు-2 భవనం

స్టాఫ్ నర్సులు, ఒక ఫార్మాసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను నియమించారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి



అర్బన్ హెల్త్ సెంటర్లలో అందిస్తున్న ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. అర్బన్ సెంటర్లకు వస్తే వారికి వైద్య సేవలతో పాటు టెస్టులు, మందులు ఉచితంగానే ఇస్తారు. ప్రస్తుతం రోజుకు దాదాపు 50 మంది రోగులు మాత్రమే వస్తున్నారు. ఈ సంఖ్య 100కు పెంచేందుకు ప్రయత్నిస్తున్నాం.

– డాక్టర్ జి.వెంకటకృష్ణ, వైద్యాధికారి, అర్బన్ హెల్త్ సెంటరు-2, అమలాపురం

నెలకు రెండుసార్లు వస్తాం



అమలాపురం అర్బన్ హెల్త్ సెంటరు-2కు నేను, నా భార్య నెలకు రెండుసార్లు వచ్చి షుగర్, బీపీ టెస్టులు చేయించుకుంటాం. ఉచితంగా మందులు తీసుకుంటాం. అర్బన్ హెల్త్ సెంటరులో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి.

– టీఏ ఆచారి, అమలాపురం

కనుల విందుగా కార్తిక పౌర్ణమి



పచ్చిపూల అలంకరణలో స్వామివారు, రజత చీరలో భద్రకాళి అమ్మవారు

- శివనామస్మరణతో మారుమోగిన శివాలయాలు
- భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు



ప్రత్యేక అలంకరణలో నీలపల్లి నీలకంఠేశ్వరుడు

ఐ.పోలవరం: కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని శివాలయాలు శివనామస్మరణతో మారుమోగాయి. ప్రముఖ పుణ్యక్షేత్రమైన మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. కేశనకుర్రుపాలెం రాజరాజేశ్వరీ సమేత రామలింగేశ్వరస్వామికి ఘనంగా పూజలు చేశారు. టి.కొత్తపల్లి, ఐ.పోలవరం, కేశనకుర్రు, జి.వేమవరం, ఎదుర్లంక తదితర గ్రామాల్లో ఉన్న శివాలయాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆదివారం రాత్రి ఆలయంలో జ్వాలాతోరణం మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ధూపసేవ మేళ తాళాలతో, వీరభద్రుడి శూలాల సంబరంతో మారుమోగింది. అనంతరం ఆలయంలో జ్యోతిలింగార్చన చేశారు. ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నీలపల్లిలో వైభవంగా లక్షపత్రి పూజ

తాళ్లరేవు: పవిత్ర కార్తిక మాసం సందర్భంగా నీలపల్లి మీనాక్షి సమేత నీలకంఠేశ్వర స్వామివారి ఆలయంలో ఆదివారం లక్షపత్రి పూజ వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకంఠం భీమేశ్వరస్వామి నేతృత్వంలో వేద పండితులు విశేష పూజలు నిర్వహించారు. నీలకంఠేశ్వర స్వామివారికి 11 రకాల ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. కార్తిక పౌర్ణమి సందర్భంగా ఆదివారం సాయంత్రం నిర్వహించిన జ్వాలా తోరణం కార్యక్రమంలో భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.



అమలాపురం రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద వెలిగించిన జ్వాలా తోరణం

దేదీప్యమానంగా జ్వాలాతోరణం

అమలాపురం టౌన్: స్థానిక శివాలయం రోడ్డులోని సర్వమంగళ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద కార్తిక పౌర్ణమి సందర్భంగా ఆదివారం రాత్రి జ్వాలా తోరణం వెలిగించారు. ఆలయ అనువంశిక చైర్మన్ మాచిరాజు రవికుమార్, నాగవల్లి దంపతులు జ్వాలా తోరణాన్ని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

శాస్త్రీయ అవగాహనతోనే మూఢ నమ్మకాల నివారణ

అమలాపురం టౌన్: ప్రతిఒక్కరిలో శాస్త్రీయ అవగాహనతోనే మూఢ నమ్మకాలను నివారించగలుగుతామని భారత హేతువాద సంఘ ప్రధాన కార్యదర్శి మేడూరి సత్యనారాయణ అన్నారు. అమలాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వద్ద ఆదివారం జరిగిన హేతువాద మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా జరిగిన హేతువాద మానవవాద అధ్యయన తరగతుల్లో అంశాల వారీగా సుదీర్ఘ చర్చ జరిగింది. రాష్ట్ర హేతువాద సంఘం ప్రధాన కార్యదర్శి షేక్ దరియావలి, జిల్లా సంఘం అధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి డి.రాజశేఖర్ తదితరులు ప్రసంగించారు. భారత హేతువాద సంఘం ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ రచించిన "మానవుడు- మానవత్వం" అనే పుస్తకాన్ని రచయిత సవేర ఆవిష్కరించారు.



'మానవుడు- మానవత్వం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న హేతువాద సంఘ సభ్యులు

మాదిగల ఆత్మీయ సమ్మేళనానికి తరలిరండి

అల్లవరం: వచ్చే నెల 11న అమలాపురంలోని కొంకాపల్లి సత్తెమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో నిర్వహించనున్న మాదిగ, మాదిగ ఉప కులాల ఆత్మీయ సమ్మేళనానికి తరలి రావాలని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ పిలుపునిచ్చారు. గోడిలోని ఆయన నివాసంలో ఆదివారం ఆత్మీయ సమ్మేళన మహాసభ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు కేంద్ర ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. మాదిగ, మాదిగ ఉపకులాలు ఐక్యంగా ఉంటే రాజకీయ మనుగడకు వేదిక అవుతుందన్నారు. రాజకీయాలకు అతీతంగా మహాసభను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో అల్లవరం, ఉప్పలగుప్తం, అమలాపురం మండలాలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు.



మాదిగల ఆత్మీయ సమ్మేళనం కరపత్రాన్ని ప్రదర్శిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

ప్రాథమిక హక్కులపై అవగాహన పెంచుకోవాలి

ముమ్మిడివరం: ప్రతి పౌరుడు ప్రాథమిక హక్కులు, విధులపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరముందని జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రెహంతుల్లా పేర్కొన్నారు. జాతీయ న్యాయదినోత్సవాన్ని పురష్కరించుకుని ఆదివారం కోర్టు ఆవరణలో రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ చేశారు. చట్టసభలు చేసే రాజ్యాంగాలు న్యాయబద్ధంగా నడుచుకుంటు న్నాయా లేదా చూసే బాధ్యత న్యాయస్థానాలపై ఉందన్నారు. డా.బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం 1949 నవంబరు 26న ఆమోదించారని చెప్పారు. కార్యక్రమంలో న్యాయవాదులు దోనిపాటి అంజనేయులు, బీరప్రసాద్‌బాబు, దాసరి సత్యనారాయణ, పీవీ సత్యనారాయణ, కాశి సింహాద్రివర్మ తదితరులు పాల్గొన్నారు.



న్యాయ సదస్సులో మాట్లాడుతున్న జడ్జి మహమ్మద్ రెహంతుల్లా

దంత సంరక్షణపై అవగాహనతో ఉండాలి

అమలాపురం టౌన్: ప్రతిఒక్కరూ దంత సంరక్షణపై అవగాహనతో ఉండాలని దంత వైద్య నిపుణుడు సీహెచ్ పవన్‌కుమార్ సూచించారు. సాయి సంజీవిని వాకర్స్ యోగా ఆరోగ్య సంస్థ, మహిళా ఆరోగ్య సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక కూచిమంచి అగ్రహారంలో ఆదివారం ఉదయం జరిగిన ఆరోగ్య అవగాహన సదస్సులో డాక్టర్ పవన్‌కుమార్ మాట్లాడారు. ప్రతీ వ్యక్తి రెండు లేదా మూడేళ్లకోసారి విధిగా దంత వైద్యుడిని సంప్రదించి తమ దంతాలను పరీక్ష చేయించుకోవాలని సూచించారు. అనంతరం కవి నల్లా నరసింహమూర్తిని సదస్సులో సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, మహిళా ఆరోగ్య సంస్థ అధ్యక్షురాలు జల్లి సుజాత, కొప్పిశెట్టి నాగేశ్వరరావు, చాట్ల లక్ష్మీనారాయణ, కడలి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఆరోగ్య సదస్సులో మాట్లాడుతున్న దంత వైద్య నిపుణుడు పవన్‌కుమార్

నూతన కార్యవర్గం ఎంపిక

అమలాపురం టౌన్: జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలల లెక్చరర్ల అసోసియేషన్‌లో నూతన కార్యవర్గాన్ని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు యాళ్ల లక్ష్మణరావు, ఉపాధ్యక్షుడు అడబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నుకున్నారు.

కార్యదర్శిగా లెక్చరర్ ఎం.అంబేడ్కర్, జాయింట్ సెక్రటరీగా లెక్చరర్ డీవీవీ నాగేశ్వరరావురెడ్డి, కోశాధికారిగా లెక్చరర్ ఎస్‌వీ సూర్యనారాయణరెడ్డి, అడ్వైజరీ కమిటీ సభ్యునిగా ఎస్‌వీ ప్రసాదరెడ్డి, స్టేట్ కౌన్సిలర్‌గా ఎం.రామారావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



జూనియర్ లెక్చరర్ల అసోసియేషన్‌కు నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

బర్రెలక్కకు కుడుపూడి సహాయం

తాళ్లరేవు: తెలంగాణ ఎన్నికల్లో కొల్లాపూర్ నియోజకవర్గం నుంచి స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేస్తున్న శిరీష(బర్రెలక్క)కు ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ రూ.25 వేల చెక్కును పంపించారు. ఈ సందర్భంగా శివన్నారాయణ మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివిన శిరీష ఉద్యోగావకాశం రాకపోవడంతో తానే స్వయంగా ఎన్నికల్లో పోటీ చేయడం అభినందనీయమన్నారు.



బర్రెలక్కకు రూ.25 వేల చెక్కును పంపుతున్న శివన్నారాయణ

కార్తిక వన సమారాధన

అమలాపురం రూరల్: స్థానిక దుర్గా హనుమాన్ సెంటర్, ఆంధ్ర ఆటోవాలా ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బండారులంక లక్కింశెట్టి వారి తోటలో కార్తిక వన సమారాధన ఆదివారం నిర్వహించారు. వన సమారాధనలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. కమిటీ సభ్యులు బి.నాని, ఆనంద్, బండారు శీను, కముజు రాజు, మంగరాజు, దంగేటి సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం

అల్లవరం: ప్రపంచంలోనే అతి పెద్ద లిఖిత రాజ్యాంగం భారత రాజ్యాంగమని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. ఆదివారం గోడి సచివాలయంలో సర్పంచ్ తోట శ్రీదేవి అధ్యక్షతన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అల్లవరం ఎంపీడీఓ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

యానాం: స్థానిక పాతబస్టాండ్ సెంటర్‌లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. స్థానిక అంబేడ్కర్ విజ్ఞాన్‌భవన్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి సైతం ఆయన నివాళులర్పించారు.

అమలాపురం టౌన్: స్థానిక గడియారం స్తంభం సెంటరులో ఆర్‌పీఐ జాతీయ కార్యదర్శి డీబీ లోక్ అధ్యక్షతన 77వ రాజ్యాంగ దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఐ.పోలవరం: భారత రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని పశువుల్లంక హైస్కూల్‌లో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అమలాపురం రూరల్: భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అమలాపురంలో రోడ్డు పక్కన జీవిస్తున్న అనాథలు, వృద్ధులు, మతిస్థిమితం లేనివారికి దళితసేన అధ్యక్షుడు డేవిడ్ అంబేడ్కర్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు.

తాళ్లరేవు: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, మాజీ జెడ్పీ చైర్మన్ దున్నా జనార్దనరావు, ఎంపీడీఓ ఎం.అనుపమ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఉప్పలగుప్తం: మండలంలోని ఎస్.కొత్తపల్లి గ్రామంలో సర్పంచ్ కుంచే చిట్టికుమారి ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్



అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రం వద్ద అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అశోక్



అమలాపురంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహిస్తున్న వివిధ సంఘాల నాయకులు

నల్ల జెండాలతో నిరసన



ముమ్మిడివరంలో ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

ముమ్మిడివరం: ప్రధాని మోడీ తిరుపతి పర్యటనను వ్యతిరేకిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ద్రోహం చేసిన ప్రధాని నరేంద్ర మోడీ గోబ్యాక్ అంటూ మండలంలోని మహిపాల చెరువు సెంటర్‌లో సీపీఎం పార్టీ నేతలు ఆదివారం నల్ల జెండాలతో నిరసన తెలియజేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విశాఖ రైల్వే జోన్ ఇవ్వకపోవడమే కాక విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ అంశాలపై మోడీ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ ఈ ఆందోళన చేస్తున్నామన్నారు. ఆందోళనలో జి.దుర్గాప్రసాద్, బీవీడీఎస్ శ్రీనివాస్, విత్తనాల రాంబాబు, డి.సోమరాజు, పి.శ్రీను, శ్రీరామమూర్తి, పి.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



ఓలేటి దుర్గా భవాని

ఐ.పోలవరం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జేఎన్‌టీయూ గ్రౌండ్స్ కాకినాడలో నిర్వహించిన జూనియర్స్ ఖోఖో సెలక్షన్‌లో ఐ.పోలవరం మండలం భైరవపాలెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని ఓలేటి దుర్గా భవాని ఎంపికైందని పాఠశాల హెచ్‌ఎం ఎంవీఎస్ మూర్తి తెలిపారు. ఈ నెల 26, 27, 28 తేదీల్లో గుంటూరు జిల్లా నరసరావుపేటలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ ఖోఖో పోటీల్లో విద్యార్థిని దుర్గాభవాని పాల్గొంటుందన్నారు. విద్యార్థినికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు షేక్ మహబూబ్ షరీఫ్‌ను సర్పంచ్ పెమ్మాడి బాబూరావు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆక్రమణల చెరలో మడ అడవులు



మడ అడవులను తొలగించి నింపేసిన ఇసుక

అల్లవరం: మండలంలోని ఎస్.రామేశ్వరం బ్రిడ్జిని ఆనుకుని ఉన్న మడ అడవులు ఆక్రమణకు గురవుతున్నాయి. ఎస్.రామేశ్వరం ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి సముద్ర ఇసుకని ట్రాక్టర్ల ద్వారా తరలించి మడ అడవులను కప్పేస్తున్నారు. ఇప్పటికే అనధికార ఆక్వా చెరువుల కోసం తీరానికి రక్షణ కవచంగా ఉండే వందలాది ఎకరాల మడ అడవులను ఆక్రమించుకున్నారని, మరికొందరు తమ స్వలాభం కోసం మిగిలిన మడ అడవులనూ తొలగిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీనిపై తహసీల్దార్ సాంబశివప్రసాద్‌ని వివరణ కోరగా తక్షణమే పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వన సమారాధనను విజయవంతం చేయాలి



ఇందుపల్లిలో వన సమారాధన కరపత్రాలు పంపిణీ చేస్తున్న సంఘ నాయకులు

అమలాపురం రూరల్: వచ్చే నెల 3వ తేదీన అమలాపురం వాసర్ల గార్డెన్స్‌లో జరగనున్న శెట్టిబలిజ కార్తిక వన సమారాధనను విజయవంతం చేయాలని శెట్టిబలిజ సంఘ నాయకులు, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని చంద్రశేఖర్, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొంతు గోవిందుశెట్టి పిలుపునిచ్చారు. ఆదివారం ఇందుపల్లి, పట్టణంలోని వనచర్ల వారి వీధిలో శెట్టిబలిజ వర్గీయులను కలిసి వన సమారాధన కరపత్రాలు అందించి ఆహ్వానించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు దంగేటి రుద్ర, కముజు రమణ, వాసర్ల సుబ్బారావు, యల్లమెల్లి రాజమోహన్, కుడిపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల అందజేత



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

ముమ్మిడివరం: జీఎస్‌బీఎన్‌రెడ్డి ట్రస్ట్ 27వ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థిని హసీనాకు రూ.10 వేలు, బి.పార్వతికి రూ.5 వేలు బహుమతిగా అందజేశారు. కార్యక్రమానికి ఎస్ఎన్ మున్నేశ్వరరావు అధ్యక్షత వహించారు. అనంతరం వివిధ విభాగాల్లో అవార్డులు అందుకున్న జేవీఎల్ నరసింహరావు, డి.సోమసుందర ఫణికుమార్, నిమ్మకాయల నారాయణరావు, హరిసంతోష్, బాబులను సత్కరించారు. కార్యక్రమంలో పెయ్యల పరశురాముడు, ఎస్.సత్యనారాయణ, విత్తనాల వరప్రసాద్, యలమంచిలి బాలరాజు పాల్గొన్నారు.